www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 29 జులై 2024
5
తూర్పుగోదావరి

ట్రాఫిక్ నియంత్రణకు సమగ్ర ప్రణాళిక

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ఆక్రమణల తొలగింపునకు పోలీసు, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు ఏర్పాటు చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. ఆదివారం నగర పాలక సంస్థ అధికారులు పోలీసు అధికారులతో కలిసి నగరంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ, జిల్లా ప్రధాన కేంద్రం రాజమహేంద్రవరంలో ట్రాఫిక్ పూర్తి నియంత్రణ నేపథ్యంలో క్రమబద్ధీకరణ చేయాల్సి ఉందన్నారు. అందుకు అనుగుణంగా రూట్ మ్యాప్ సిద్ధం చేసి ఆక్రమణ తొలగింపునకు సంబంధించి సమగ్ర నివేదిక అందజేయాలన్నారు. 2027లో గోదావరి పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని యాక్షన్ ప్లాన్ రూపొందించాలని తెలిపారు.

ఊళ్ల నిండా నీళ్లు

మామిడికుదురు మండలంలో బోట్ పాయింట్ వద్ద గోదారి ఉధృతి

- ముంపులో 75 లంక గ్రామాలు
- కాజ్‌వేలు మునగడంతో పడవలపై ప్రయాణాలు
- 6 వేల ఎకరాల్లో పంటలకు నష్టం
- కాటన్ బ్యారేజీ వద్ద మరింత పెరుగుతున్న వరద

గోదావరి మహోగ్రరూపం దాల్చింది. లంకలను నిండా ముంచేసింది. లంకల్లోని ఊళ్లన్నీ వరద నీళ్లతో నిండిపోయాయి. వేలాది ఎకరాల్లో పంట వరద పాలైంది. కొన్ని గ్రామాలకు బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. పచ్చిగడ్డి కొరతతో పశువులు అల్లాడుతున్నాయి. ముంపు బాధితులకు సహాయచర్యల్లో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. మరోపక్క ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద వరద ఉధృతి క్షణక్షణానికి పెరగడంతో తీరప్రాంత ప్రజల్లో ఆందోళన నెలకొంది. మూడు రోజుల పాటు ఇదే పరిస్థితి కొనసాగుతుందని అధికారుల హెచ్చరికలతో లంక గ్రామాల ప్రజలు మరింత బెంబేలెత్తుతున్నారు.

:: ప్రజాశక్తి - యంత్రాంగం ::

75 గ్రామాల్లో వరద ముంపు

గోదావరి వరదకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా 75 గ్రామాలు ముంపు బారిన పడ్డాయి. ఆలమూరు మండలంలో మడికి, బడుగువానిలంక, చెముడులంక, చొప్పెల్ల మూలస్థాన అగ్రహారం, జొన్నాడ లంక భూముల్లోకి భారీగా వరదనీరు చేరింది. మామిడికుదురు మండలంలో బి.దొడ్డవరం, పెదపట్నం లంక, అప్పనపల్లి, పెదపట్నం, పాశర్లపూడిలో శ్రీరామపేట, పల్లపాలెం పూర్తిగా జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. వీటికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. అప్పనపల్లి, బి.దొడ్డవరం ఇందిరమ్మ కాలనీలు పూర్తిగా వరద నీట మునిగాయి. కపిలేశ్వరపురం మండలంలో కేదార్లంక, నారాయణలంక, వీధివారిలంక, పల్లపులంక, అద్దంకి వారి లంకలు నీటమునిగాయి. కోరుమిల్లి, తాతపూడి, కపిలేశ్వరపురం, పుష్కర ఘాట్ల వద్ద ప్రవాహం ఉధృతంగా ఉంది. ముమ్మిడివరం మండలంలోని రానేలంక పంచాయతీ పరిధిలోని వివేకానంద వారధి, కూనలంక నుంచి గురజాపులంక వరకు నీట మునిగింది. గేదెలంక, చింతపల్లిలంక, సలాదివారి పాలెం గ్రామాలు పూర్తిగా నీట మునిగాయి. రోడ్డుపై నాలుగు అడుగుల మేర ప్రవాహం ఉంది.



ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద గోదావరి పరవళ్లు

పడవ బోల్తా - వ్యక్తి గల్లంతు

మామిడికుదురు రూరల్: గోదావరి వరద నేపథ్యంలో నిర్వాసితులకు చేపడుతున్న సహాయ చర్యల్లో విషాదం నెలకొంది. ముంపు బాధితులకు తాగునీటిని అందించేందుకు వెళ్తున్న బోటు బోల్తాపడింది. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం ఊడిమూడి లంక వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. ఊడిమూడి లంకలో నిర్వాసితులకు తాగునీటిని అందించేందుకు వాటర్ ప్యాకెట్ల బస్తాలు, క్యాన్లతో ఆరుగురు ఉద్యోగులు బయలు దేరారు. పడవ నది మధ్యకు చేరేసరికి ఉధృతికి బోల్తాపడింది. ఈ ఘటనలో గంటిపెదపూడి పంచాయతీ ఉద్యోగి చదలవాడ విజయ్‌కుమార్(26) గల్లంతయ్యాడు. మిగిలిన ఐదుగురూ బయటపడ్డారు. విజయ్‌కుమార్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న సిఎం చంద్రబాబు స్పందించారు. విజయ్‌కుమార్ కుటుంబానికి రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

కాటన్ బ్యారేజీ వద్ద పెరుగుతున్న ఉధృతి

రాజమహేంద్రవరం రూరల్ : భద్రాచలం వద్ద క్రమ క్రమంగా తగ్గుముఖం పడుతున్నప్పటికీ ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజ్ వద్ద పోటెత్తుతోంది. భద్రాచలం వద్ద ఆదివారం నాటికి 48.10 అడుగుల నీటిమట్టం నమోదైంది. ఇదే సమయంలో ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజ్ వద్ద 15.80 అడుగుల నీటిమట్టం నమోదైంది. దీంతో అక్కడి 175 గేట్ల ద్వారా 16.09 లక్షల క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెడుతున్నారు. రెండు రోజులుగా ఇక్కడ రెండో ప్రమాద హెచ్చరిక అమల్లోనే ఉంది. ఉధృతి నేపథ్యంలో ఆదివారం రాత్రికి ఇక్కడ మూడో ప్రమాద హెచ్చరిక ప్రకటించే అవకాశం ఉంది.

సహాయక చర్యలు

లంక గ్రామాల్లో వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి. గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులను నిర్వహిస్తున్నారు. ప్రజలను అప్రమత్తం చేస్తూ వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. మామిడికుదురు మండలం పెదపట్నంలో సర్పంచ్ గొబ్బుల దుర్గ, పంచాయతీ కార్యదర్శి జి.మైథిలి ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులు వరద బాధితులకు తాగునీటిని సరఫరాచేశారు. బి.దొడ్డవరం పంచాయతీ కార్యదర్శి పట్టి లింగం ఆధ్వర్యంలో తాగు నీరు అందజేసి సహాయ చర్యలు చేపట్టారు. ముమ్మిడివరంలో వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ద్వారా వరద బాధితులకు రక్షిత మంచినీటిని సరఫరా చేస్తున్నారు. వరద బాధితులకు బియ్యం, నిత్యావసర వస్తువులను ఇప్పటికీ పంపిణీ చేశారు. వరదల ప్రత్యేక అధికారి ఎస్.మధుసూదన్‌రావు, తహశీల్దార్ బి.శీనునాయక్, విఆర్‌ఒలు వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

పెదపట్నం లంకలో సర్పంచ్ దుర్గ, కార్యదర్శి మైథిలి ఆధ్వర్యంలో తాగునీటి సరఫరా



చెముడులంకలో వరద నీరు చేరడంతో కుళ్లిపోతున్న బొప్పాయి తోట

పంటలకు తీవ్ర నష్టం

వరదలకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా 6వేల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్టు ప్రాథమిక అంచనా వేస్తున్నారు. కపిలేశ్వరపురం మండలం కోరిమిల్లి లంక పూర్తిగా నీట మునగడంతో పంటలు పనికి రాకుండా పోయాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. లంక గ్రామాల్లో పశువులను మెరక ప్రాంతాలకు తరలించారు. ఆలమూరు మండలంలో అరటి, బొప్పాయి, జామ, కంద, తమలపాకులు వంటి వాణిజ్య పంటలతో పాటు కూరగాయల పంటలు, పూల తోటలు వరదకు పాడయ్యాయి. వివిధ రకాల ఖరీదైన నర్సరీ మొక్కలు సైతం వరద ముంపులో చిక్కుకున్నాయి. చొప్పెల్ల, మూలస్థానం లంకల్లో ఇటుక బట్టీల్లోకి వరద నీరు ప్రవేశించింది.

మేత లేక అల్లాడుతున్న పశువులు

వరదలకు లంకలన్నీ నీట మునగడంతో పశువులకు మేత దొరకడం లేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 15 మండలాల్లో 17వేల పశువులపై ఈ ప్రభావం పడింది. దీంతో లంకల్లో పశువులను ఒడ్డుకు తీసుకొచ్చేందుకు పాడి రైతులు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ప్రస్తుతం పశువుల కోసం ప్రభుత్వం దాణాను పంపిణీ చేస్తుంది. వరద కారణంగా ఇప్పటి వరకూ 43 మేకలు కొట్టుకుపోయినట్టు గుర్తించారు.

విద్యార్థినులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం రూరల్

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, డిఎంహెచ్ఒ సమన్వయంతో స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల దగ్గర ఉన్న ఎస్‌సి బాలిక హాస్టల్ విద్యార్థినులకు ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ కె.ప్రకాష్‌బాబు మాట్లాడారు. ఈ వైద్య శిబిరంలో ఇసిజి, బిపి, సుగర్, హిమోగ్లోబిన్, మొదలగు పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పరీక్షల అనంతరం విద్యార్థులకు మందులు అందజేశారు. మెడికల్ ఆఫీసర్ డి.అలేఖ్య, కె.శారద, ల్యాబ్ టెక్నీషియన్ వై.బాలదుర్గా, ఎఎన్ఎం రాజ్యలక్ష్మి, ఆశా కార్యకర్తలు కె.బేబీ, కె.కరుణ పాల్గొన్నారు.

తహశీల్దారు సావిత్రిని సత్కరిస్తున్న సిబ్బంది

తహశీల్దారు సావిత్రికి ఘన వీడ్కోలు

ప్రజాశక్తి-చాగల్లు

తహశీల్దారు ఎం.సావిత్రికి ఆదివారం రెవెన్యూ, సిబ్బంది, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. సావిత్రి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పని చేసిన సందర్భంగా అందరూ సహాయ సహకారాలు అందించారని కృతజ్ఞతలు తెలిపారు.

కార్టూ'నిజం'



ఎర్ర కాలువ వరద ముంపు నివారణకు చర్యలు

వరద ప్రాంతాల్లో మంత్రుల బృందం పర్యటన

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి, నిడదవోలు, సీతానగరం, ఉండ్రాజవరం

శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా ఎంత ఖర్చయినా రాష్ట్ర ప్రభుత్వం ఎర్ర కాలువ వరద ముంపు నివారణకు తక్షణ పనులు యుద్ధ ప్రాతిపదికన, శాశ్వత ప్రాతిపదికన ఆధునీకరణ పనులు చేపట్టి పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, హోమ్ శాఖ మంత్రి వంగలపూడి అనిత, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఆదివారం వారు నిడదవోలు నియోజకవర్గంలోని ఉండ్రాజవరం, సూర్యారావుపాలెం, పసలపూడి, కాల్దారి, తాళ్లపాలెం, కంసాలపాలెం, సింగవరం, రావిమెట్ల గ్రామాల్లో పర్యటించారు. నీట మునిగిన పంట పొలాలను పరిశీలించి, రైతులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖామంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ఎర్ర కాలువ వరద ఉధతి వల ప్రతి ఏడాదీ వేలాది ఎకరాలు పంట ముంపునకు గురై పంట నష్టం ఏర్పడడం వల్ల రైతులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. ఎర్రకాలువ ముంపు నివారణకు శాశ్వత పరిష్కారం దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుందని తెలిపారు. 48 రోజులుగా ఎంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శాఖల వారీగా సమీక్షలు చేస్తూ రాష్ట్రాన్ని అభివద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. ప్రకతి విపత్తులు భారీ వర్షాలు, వరదల కారణంగా తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలో చాలా గ్రామాలు ముంపునకు గురవుతున్నాయని, ప్రాణ ఆస్తి నష్టం జరగకుండా ముంపు నివారణ ప్రాంతాల్లో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా చర్యలు చేపట్టాలని హోమ్ శాఖ మంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం ఎర్రకాలువ ఏటి గట్టుపై తట్టెడు మట్టి కూడా వేయక పోవడం వల్ల నేడు వేలాది ఎకరాలు ముంపు బారిన పడ్డాయన్నారు. సిఎం చంద్రబాబు ఆదేశాలతో బందాలుగా ఏర్పడి వరద ముంపు ప్రాంతాల్లోని గ్రామాల్లో తిరుగుతూ పంట నష్టాలను పరిశీలిస్తూ రైతులకు భరోసా కల్పిస్తున్నామన్నారు. ఈ పర్యటనలో మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావు, వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీ రావు, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ పాల్గొన్నారు. సీతానగరం మండలంలో మంత్రుల బృందం పర్యటించింది. బొబ్బిల్లంక, రాపాకలో ముంపునకు గురైన పంటపొలాలను మంత్రులు పరిశీలించారు. ఆర్‌డిఒ చైత్ర వర్షిణి, రాజానగరం ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ, టిడిపి రాజానగరం ఇన్‌ఛార్జి బొడ్డు వెంకట రమణ చౌదరి పాల్గొన్నారు.

సీతానగరంలో రైతులతో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రులు

ఘనంగా హెపటైటిస్ దినోత్సవం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో ఆదివారం ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం డిఎంహెచ్ఒ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. హెపటైటిస్ వ్యాధి గురించి అవగాహన పెంచడం, నిర్ధారణ, చికిత్స, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. హెపటైటిస్ వైరల్ ఇన్‌ఫెక్షన్ కారణంగా కాలేయం బాధపడే వ్యాధి. ఇది ప్రస్తుత ప్రపంచ ఆరోగ్య సమస్యగా పరిణమించిందని, లక్షలాది ప్రజలు ఈ వ్యాధి బారిన పడుతున్నారు. హెపటైటిస్ ఎబిసిడిఇగా విభజించారని తెలిపారు. ఈ వైరస్‌లు కాలేయం పనితీరును నాశనం చేయడం, కాలేయ కేన్సర్, కాలేయ సిరోసిస్ వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుందని తెలిపారు. ఈ సంవత్సరపు ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం యొక్క థీమ్ ఇట్స్ టైం ఫర్ యాక్షన్ నినాదం ఇచ్చారన్నారు. ఈ వ్యాధి గురించి అవగాహన పెంచడం, నిర్ధారణ, చికిత్స, నివారణ పద్ధతుల గురించి ప్రజలకు తెలియజేయడం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆరోగ్య శాఖ ప్రజలకు హెపటైటిస్ నివారణకు సంబంధించి ముఖ్యమైన సమాచారం, రోగ నిర్ధారణ, సురక్షితమైన వైద్య పద్ధతులు పాటించడం వంటి విషయాలు తెలియజేస్తుందన్నారు. హెపటైటిస్‌ను నివారించేందుకు సరైన వ్యాధి నిర్ధారణ, సమయానుకూల చికిత్స అవసరం అన్నారు. ప్రజలు వారి ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టడం, వ్యాధి లక్షణాలను గుర్తించడం, మరియు వైద్య సలహా తీసుకోవడం ద్వారా హెపటైటిస్ వ్యాధిని కట్టడి చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిడిమియాలజిస్ట్ సుధీర్ బాబు, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ షమ్మీ కుమార్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శర్మ, హెల్త్ సూపర్‌వైజర్ బి.ప్రసాద్, ఆశ వర్కర్లు మరియు ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హెపటైటిస్ దినోత్సవంలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

వెంకటేష్ కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న కార్మికులు

వెంకటేష్ కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-తాళ్లపూడి

అన్నదేవరపేట పంచాయతీలో పని చేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన కార్మికుడు బొంతు వెంకటేష్ కుటుంబానికి ఆదివారం తోటి కార్మికులు, పలు పంచాయతీల అధికారులు వివిధ రూపాల్లో ఆర్థిక వస్తు సాయం అందజేశారు. మృతుని మట్టి ఖర్చులు నిమిత్తం అతను పనిచేసిన అన్నదేవరపేట గ్రామ పంచాయతీ కార్యదర్శి వీరన్న రూ.15 వేల ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన పంచాయతీ కార్మికులు, వేగేశ్వరపురం కార్యదర్శి శ్రీనివాస్ ప్రక్కిలంక కార్యదర్శి దుర్గాప్రసాద్ మతుడి కుటుంబానికి నిత్యవసర వస్తువులు, బియ్యం ప్యాకెట్, కూరగాయలు, ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు ముప్పిడి రవికుమార్, కార్యదర్శి కొండే వెంకటేష్, కోశాధికారి గెడ్డం అరవాల రాజు, నాని, శ్రీను, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఎండిన చెట్టు

ప్రజాశక్తి-గోపాలపురం

మండలంలోని దొండపూడి గ్రామ శివారులో ప్రమాదకరంగా ఉన్న ఎండిన భారీ వక్షాన్ని తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామ శివారులో ఉన్న పెట్రోల్ బంకు సమీపంలో పోలవరం వైపు ఆర్ అండ్ బి రోడ్డు పక్కన భారీ వక్షం చచ్చిపోయిందన్నారు. గత కొన్ని నెలల క్రితం ఎండిపోయి పడిపోయే దశకు చేరుకుంది. వర్షాకాలం కావడంతో వర్షాలకు గాలి దుమ్ములకు ఎప్పుడు ఎవరి మీద పడుతుందో తెలియని దుస్థితి ఏర్పడిందని అన్నారు. దీంతో ఆ చుట్టుపక్క నుండి ఆర్ అండ్ బి రోడ్డు మీదుగా వెళ్లాలంటే భయాందోళనకు గురవుతున్నామని తెలిపారు. చుట్టుపక్కల గ్రామాలు మండలాల నుంచి దొండపూడి మీదుగా పట్టిసీమ, పోలవరం, కొవ్వూరు, రాజమండ్రికి నిత్యం ప్రజలు ఈ రోడ్డు వెంబడి ప్రమాదకరంగా ఉన్న చెట్టు మీదుగా వెళుతుంటారని తెలిపారు. దీంతో ఆ చెట్టు శిథిలావస్థలో ఉండడంతో ఎప్పుడు పడుతుందో తెలియని పరిస్థితి ఏర్పడిందని దీంతో ప్రమాదం పొంచి ఉందని అధికారులు స్పందించి ప్రమాదం జరగకుండా ముందుగానే ఆ చెట్టును తొలగించాలని ప్రజల కోరారు.

అన్ని గ్రామాల్లో సేవలందించడమే లక్ష్యం

ప్రజాశక్తి-గోపాలపురం

మండలంలోని అన్ని గ్రామాల్లో ఆపదలో ఉన్నవారికి సేవలు అందించడమే లక్ష్యంగా పని చేస్తామని మానవత సేవా సంస్థ మండల అధ్యక్షులు పప్పు సత్య కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని వెదుళ్ళకుంట గ్రామంలో మండలం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. అనంతరం కృష్ణారెడ్డి మాట్లాడుతూ మండలంలో ప్రతి మారుమూల గ్రామంలో మానవత సేవలు అందేలా కషి చేస్తామని చెప్పారు. మానవత స్వచ్ఛంద సంస్థ ద్వారా ఆపదలో ఉన్న వారికి ఉపయోగపడే విధంగా సాయం అందించి ఆదుకోవడం పట్ల మానవత్వం సేవలు వెలకట్టలేనివని గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో యంట్రప్రగడ మంగారావు, జ్యేష్ట శ్రీనివాసరావు, వల్లభనేని సత్యనారాయణ, జొన్నలగడ్డ రాంబాబు, గెడా జోగేంద్ర ప్రసాద్, కుక్కల కీర్తి కుమార్, జుత్తుగ సూర్య చంద్ర, కొయ్య నాగరాజు, జొన్నలగడ్డ ప్రసాద్, జ్యేష్ట సతీష్ బాబు, బెనర్జీ మాస్టారు, పల్లోతు శ్రీను, సుంకర మంగారావు, కొండలరావు, దోనెల్లి దుర్గారావు, బొడ్డు ప్రసాద్, బూసి మురళీకృష్ణ, రాధాకృష్ణ, ముప్పన కృపా వరప్రసాద్ పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు చీరలు అందిస్తున్న మానవత సభ్యులు

బాధితులకు సాయం అందిస్తున్న ఎన్‌డిఎ కూటమి నాయకులు

ముంపు బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-నల్లజర్ల

అనంతపల్లిలో ముంపు బాధితులకు ఎన్‌డిఎ కూటమి నాయకులు ఆదివారం సాయం అందించారు. ఎర్ర కాలువ వరద లోతట్టు ప్రాంతానికి చెందిన ఐదు కుటుంబాల వారికి అనంతపల్లిలోని నెంబర్ వన్ పాఠశాలలో పునరావాస కేంద్రాన్ని ప్రభుత్వ అధికారులు ఏర్పాటు చేశారు. కొద్దిరోజుల పాటు వీరికి ఆహారం నిమిత్తం అనంతపల్లి గ్రామానికి చెందిన నాయకులు ఒక్కో కుటుంబానికి 25 కేజీలు బియ్యం, కేజీ కందిపప్పు, కేజీ నూనె ప్యాకెట్, కేజీ బంగాళదుంపలు తదితర నిత్యావసర సరుకులతో పాటు, ఒక్కొక్క కుటుంబానికి రూ.3000 చొప్పున సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి జమ్ముల వీర వెంకట సతీష్, వల్లిరెడ్డి సతీష్, శెట్టిపల్లి శివ నాగరాజు, పిసిని శ్రీనివాస్, గురుమిల్లి శ్రీను, తాడి నాగరాజు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

అల్లరి మూకల దాడిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కాకినాడ

అల్లరి మూకల దాడిలో ఒక వ్యక్తి మృతి చెందగా, మరో ముగ్గురు గాయాలపాలయ్యారు. ఆదివారం వన్ టౌన్ పోలీసులు వెల్లడించిన వివరాల మేరకు...ముమ్మిడివరం మండలం సోమదేవరపాలెం పంచాయతీ సూరయ్య చెరువు గ్రామానికి చెందిన సుమారు 10 మంది టాటా మేజిక్ వాహనంలో శనివారం రాత్రి తలుపులమ్మ లోవకు బయలు దేరారు. రాత్రి సుమారు 11.55 గంటలకు జగన్నాధపురం మునుసుబు సెంటర్ శివాలయం వద్దకు వచ్చేసరికి బైక్ మీద ముగ్గురు వ్యక్తులు వచ్చి వారి వాహనాన్ని ఆపారు. తూరంగి శివాలయం దగ్గర మమ్మల్ని డాష్ ఇచ్చింది మీరే కదా అని కేకలు వేయడం ప్రారంభించారు. మాకు తెలియదు అని చెబుతున్నా మీతోపాటు మరో రెండు వాహనాలు కూడా ఉంటాయి అని అంటూ ఎవరికో ఫోన్ చేశారు. కొద్దిసేపటికి 4 బైక్స్ మీద మరి కొంతమంది వచ్చి టాటా మేజిక్ వాహనం అద్దం పగులకొట్టారు. వాహనంలో ఉన్నవారు కిందకి దిగగానే బైక్ మీద వచ్చిన వాళ్ల రాళ్లతో వీరిని కొట్టి పరార్ అయ్యారు. గాయపడిన వారిని ఆటోలో కాకినాడ జిజిహెచ్‌కు తీసుకువెళుతుండగా అప్పటికే చెట్ల గాలి దేవుడు (46) మృతి చెందాడు. ఉందుర్తి సాయి రామకృష్ణ, ఉందుర్తి వెంకట కుమారస్వామి, మట్టపర్తి నాగేశ్వరరావు గాయాలపాలయ్యారు. అల్లరి మూకల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

వికె.రాయపురం సర్పంచ్ మృతి

ప్రజాశక్తి - సామర్లకోట

మండలానికి చెందిన వికెరాయిపురం సర్పంచ్ మార్త పూర్ణిమ ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శనివారం రాత్రి మృతి చెందారు. గురువారం ద్విచక్రవాహనంపై తన కుమారుడితో కలిసి తుని వెళుతూ తేటగుంట వద్ద రోడ్డు గోతుల్లో పడతంతో ఆమె తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక అచ్చంపేట మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో హుటాహుటిన కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి 9:30 గంటల సమయంలో పరిస్థితి విషమించి ఆమె మృతి చెందారు. సర్పంచ్ పూర్ణిమ అకాల మృతి పట్ల పెద్దాపురం వైసిపి ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబు, ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, ఉప సర్పంచ్ గొల్లపల్లి సర్వేశ్వరరావు, గ్రామ కార్యదర్శి వై.శ్రీహరి సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

మార్కొండపాడులో చోరీ

ప్రజాశక్తి - చాగల్లు

మార్కొండపాడులో ఉదయగిరి పద్మనాభం ఇంటిలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ నెల 23న పద్మనాభం తన భార్య బేబీ రాణితో కలిసి హైదరాబాదులోని తన కుమార్తె ఇంటికి వెళ్లారు. ఆదివారం ఇంటికి వచ్చి చూడగా గేటు తాళం అన్నీ వేసినట్లే ఉన్నాయి, కానీ ఇంటి తాళం లోపల బీరువా తాళాలు పగలగొట్టి ఉన్నాయి. బీరువాలోని సుమారు 45 కాసులు బంగారపు ఆభరణాలు దొంగలించినట్టు గుర్తించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ పి.నాగరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం చోరి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలంలోని పొన్నాడ పంచాయతీ రావివారిపాడు గ్రామానికి చెందిన బోనం శ్రీలక్ష్మీరమ్య కు చెందిన ద్విచక్రవాహనం చోరీకి గురయిందని వాహన యజమానురాలు ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీలక్ష్మీరమ్య భర్త సూరిబాబు ఇంటి వద్ద నుంచి తన సోదరుడు ఇంటికి వెళ్లి ద్విచక్రవాహనాన్ని పార్క్ చేసి కోనపాపపేట వెళ్లి తిరిగి వచ్చే సమయానికి వాహనం లేదని, దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఘనంగా పేరెంట్స్ డే వేడుకలు

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక భాష్యం పాఠశాలలో ఆదివారం పేరెంట్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భం గా పాఠశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ, వాణి జ్యోతి ప్రజల్వన చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ తల్లి దండ్రుల యొక్క ఆశలకు అనుగుణంగా నడుచుకోవాలని, తల్లిదండ్రులు పిల్లలకు ఎంతో శ్రమించి వారికి విద్యాబుద్ధులు నేర్పించేందుకు కృషి చేస్తారని, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేలా విద్యార్థులు దృష్టి సారించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుదుచ్చేరి గవర్నర్‌గా కైలాష్ నాథన్

ప్రజాశక్తి - యానాం

కైలాష్ నాథన్

పుదుచ్చేరి నూతన లెఫ్టినెంట్ గవర్నర్‌గా రిటైర్డ్ ఐఎఎస్ అధికారి కునియిల్ కైలాష్ నాథన్ నియమితులయ్యారు. కైలాస్ నాథన్ గుజరాత్ ముఖ్యమంత్రి కార్యాలయంలో పని చేశారు. ప్రస్తుతం గవర్నర్‌గా వ్యవహరించిన సిపి రాధా కృష్ణన్ మహారాష్ట్ర గవర్నర్‌గా నియమితులయ్యారు.

మరిడమ్మ జాతరలో పాల్గొన్నయాత్రికులు

మరిడమ్మ జాతరకు పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి - పెద్దాపురం

మరిడమ్మ జాతరకు ఆదివారం యాత్రికులు పెద్దఎత్తున పాల్గొన్నారు. మరిడమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పరిసరాలే కాకుండా మెయిన్ రోడ్డు, తదితర ప్రాంతాలన్నీ జనంతో నిండిపోయాయి. ఆలయం నుంచి అన్ని వైపులా క్యూలైన్లలో జనం కిక్కిరిసారు. యాత్రికుల సంఖ్యను దృష్టిలో పెట్టుకుని ఆలయ అనువంశిక ధర్మకర్త డాక్టర్ చింతపల్లి బ్రహ్మాజీ, అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్.రామమోహన్‌రావు పర్యవేక్షణలో సిబ్బంది యాత్రికులకు సేవలందించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పారిశుధ్యం అంతంత మాత్రమే..!

పట్టణంలో పేరుకుపోయిన చెత్తచెదారం

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణంలో పారిశుధ్య నిర్వహణ అంతంత మాత్రంగానే ఉంది. పారిశుధ్య నిర్మూలనకుకలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను అధికారులు బేఖాతర్ చేస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈనెల 23న కలెక్టర్ ఎస్ షాన్ మోహన్ పర్యటనలో పారిశుధ్య చర్యలపై అధికారులను ఆదేశించారు. పారిశుధ్య మెరుగుదలకు ఇద్దరు సానిటరీ ఇన్‌స్పెక్టర్లను నియమించినట్లు కమిషనర్ వెల్లడించారు. అధికారుల ప్రకటనలు ఆచరణ రూపం దాల్చడం లేదని స్థానిక అగ్రహారం, అమ్మణమ్మ కాలానీలను పరిశీలిస్తే తేటతెల్లం అవుతోంది. పట్టణంలోని పలు ప్రాంతాలతోపాటు అమ్మణమ్మ కాలానీకి వెళ్లే ప్రధాన రహదారిలో ఎక్కడ చెత్త కుప్పలు అక్కడే కన్పిస్తున్నా ఏమాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి పేరుకుపోయిన చెత్తను తొలగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై కమిషనర్ జె.రామారావు స్పందిస్తూ ఆదివారం సిబ్బంది సెలువులో ఉండటంతో సమస్య వచ్చిందని, పట్టణంలో పారిశుధ్య చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి - గండేపల్లి

మొక్కను నాటుతున్న శ్రీనివాసరెడ్డి, ఇతరులు

తమ పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దాలని ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆదివారం సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీలో తల్లితండ్రుల దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లితండ్రులు తమ పిల్లలకు ఆస్తిపాస్తులు ఇవ్వకపోయినా పర్వాలేదు కానీ మంచి సంస్కారాన్ని, విద్యను అందివ్వాలని సూచించారు. విద్యార్థులు తల్లితండ్రులు, గురువుల పట్ల భక్తిభావంతో మసులుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ అడ్మిషన్స్. డాక్టర్ ఎ.రామకృష్ణ, డీన్. ప్రొఫెసర్ వి.సత్యనారాయణ, జాతీయ పర్యావరణ మిత్ర తోటకూర గంగాధర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శుభాకర్ రెడ్డి, వినయ్ పాల్గొన్నారు.

చెరువులను తలపిస్తున్న రోడ్లు

ప్రజాశక్తి - జగ్గంపేట

రహదారి మధ్యలో నీటితో ఉన్న పెద్ద గొయ్యి

గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు రహదారులు చిద్రమయ్యాయి. వర్షాలకు నీరు గుంతల్లో చేరి చెరువులను తలపిస్తున్నాయి. అటుగా ప్రయాణించే ప్రయాణీకులు చెరువా లేక రహదారి అనే అయోమయ స్థితిలో ప్రయాణాలు సాగిస్తున్నారు. మండలంలోని జె. కొత్తూరు నుంచి రాజపూడి వెళ్లే రహదారి మధ్య లో రహదారి గుంతలుగా ఏర్పడి ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులను తలపిస్తున్నాయి. రహదారిపై ప్రయాణించే ప్రయాణీకులు నానా అవస్థలు పడుతున్నారు. తక్షణమే గుంతలకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

విలువలతో కూడిన విద్య అవసరం

ప్రజాశక్తి - పెద్దాపురం

పాదపూజ చేస్తున్న విద్యార్థిని

ప్రస్తుత పోటీ ప్రపంచంలో విలువలతో కూడిన విద్య అవసరమని తిరుమల ఇంగ్లీష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ నూకరాజు అన్నారు. ఆదివారం మండలంలోని దివిలి గ్రామంలో తిరుమల పాఠశాలలో పేరెంట్స్ డే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్ననాటి నుంచి తల్లిదండ్రులు, గురువులు, పెద్దల పట్ల గౌరవభావంతో మెలగాలన్నారు. పాఠశాల హెచ్ఎం పి.ఏంజెల్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచి క్రమశిక్షణతో విద్యనభ్యసించాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో అకాడమీ కో-ఆర్డినేటర్ శెట్టి ప్రసాద్, ఉపాధ్యాయులు అనంతలక్ష్మి, పద్మావతి, స్వాతి పాల్గొన్నారు.

గుంతలు పూడ్చిన కూటమి నాయకులు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - తాళ్లరేవు

రహదారిని చదును చేస్తున్న పనివారలు

ప్రయాణం ప్రాణ సంకటం అనే శీర్షికతో సుంకరపాలెం జంక్షన్ నుంచి ద్రాక్షారామ రహదారిపై వచ్చిన కథనంపై కూటమి నాయకులు స్పందించారు. ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు ఆదేశాలతో ఆదివారం కూటమి నాయకులు మోపూరి రెడ్డి నాయుడు సిమెంటుతో కలిపిన నల్ల కంకర చిప్స్‌తో రోడ్డుపై పరిచి రోడ్డుకు సమాంతరంగా గుంటను సరి చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు చీకట్ల నాగేశ్వరరావు, తాతపూడి నాగేశ్వరరావు, గొట్టుముక్కల సూరిబాబు పాల్గొన్నారు.

రహదారి ఛిద్రం

ప్రజాశక్తి - సామర్లకోట

గోతులను తప్పిస్తున్న వాహనాలు

సామర్లకోట - పెద్దాపురం ఆర్ అండ్ బి రెండు లైన్ల రహదారి అధ్వానంగా మారింది. ఈ రహదారిని ప్రస్తుతం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప మంత్రిగా ఉన్న సమయంలో నిర్మించారు. అయితే ఆ నిర్మాణం ప్రణాళికాబద్ధంగా చేపట్టకపోవడంతో వర్షపు నీరు రహదారిపైనే నిలిచిపోతుంది. దీనికితోడు గత ప్రభుత్వ పాలనలో రహదారుల పట్ల పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో రహదారి గోతులమయంగా మారిపోయింది. రాత్రి వేళ గోతుల్లో పడి అనేకమంది వాహనదారులు ప్రమాదాల భారిన పడి గాయాలపాలవుతున్నారు. అయినా సంబంధిత శాఖ అధికారులకు చీమకుట్టినట్టు కూడా ఉండటం లేదని వాహనదారులు పేర్కొంటున్నారు. ఒకపక్క విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్..మరోవైపు గతుకుల రోడ్డుతో వాహనదారులు ప్రయాణించాల్సిన దుస్థితి నెలకుంది. ప్రయాణంలో ఆదమరిస్తే అదుపుతప్పి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టే పరిస్థితి నెలకుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం తెల్లవారుజామున కురిసిన వర్షం రహదారిలో ఉన్న గోతుల్లోనే నిలిచిపోయింది. దీంతో పలువురు వాహనదారులు ప్రమాదాలకు గురయ్యారు. తక్షణమే ఆర్ అండ్ బి అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

యానాం వార్తలు

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ శ్రీనివాస్ అశోక్

అధికారులు అప్రమత్తం కావాలి

ప్రజాశక్తి - యానాం

యానాంలో వరద ముంపుపై ఆదివారం ప్రాంతీయ పరిపాలనాధికారి కార్యాలయంలో ఆర్ఎఒ మునిస్వామి అధ్యక్షతన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తూ, ముందస్తుగా సహాయక చర్యలు చేపట్టాలన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలకు పునరావస కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు వరదలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మత్స్యకారులు ఎవరు వేటకు వెళ్ళవద్దని సూచించారు. మల్లాడి కృష్ణారావు మాట్లాడుతూ మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలతో వరద పెరిగే అవకాశం ఉందన్నారు. అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండి సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ సమావేశంలో పిడబ్ల్యూడి ఇఇ చంద్రశేఖరన్, ఎఇ కాళ్ళ నాగరాజు, మున్సిపల్ ఇన్‌ఛార్జ్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, విద్యాశాఖ అధికారి పంపన లక్ష్మణప్రవీణ్, ప్రభుత్వ ఆసుపత్రి డి డి రవిశంకర్, ఎడి పలాస్‌కుమార్‌సన్యాల్, మత్స్యశాఖ అధికారి గొంతియ్య పాల్గొన్నారు.

మోటార్ల సహాయంతో నీటిని తొలగించాలి

దరియాలతిప్ప గ్రామంలో నీట మునిగిన పొలాల్లోంచి నీటిని మోటార్ల సాయంతో తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌ను రైతులు సబ్బతి లోకేశ్వరరావు, సబ్బతి శ్రీనివాసరావు, గిడ్ల వెంకన్న, కోరుకొండ ఆనందరావు, మట్టా రాంబాబు కోరారు.

లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ శ్రీనివాస్ అశోక్

గృహ నిర్మాణ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ప్రభుత్వం స్లమ్ క్లియరెన్స్ బోర్డు ఆధ్వర్యంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా గృహ నిర్మాణ లబ్ధిదారులకు ఆదివారం స్థానిక అతిథి గృహం వద్ద ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 42 మంది లబ్ధిదారులకు రూ.50 లక్షల 40 వేలు ఇవ్వడం జరిగిందన్నారు. లబ్ధిదారుల ఖాతాలో వారం రోజుల్లో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి, పుదుచ్చేరి స్లం క్లియరెన్స్ బోర్డు అధికారులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ కమిషనర్

ప్రజాశక్తి - కాకినాడ

సోమవారం ఉదయం 9.30 గంటలకు డయల్ యువర్ కమిషనర్ కార్యాక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్ భావన ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కార్పొరేషన్ కార్యాలయ ఫోన్ నెంబర్ 0884-2357800కు చేసి వివరించాలని సూచించారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి నేరుగా అర్జీలను స్వీకరిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సూచించారు.

కొత్తపేటలో ఏర్పాటుచేసిన వైద్యశిబిరం

కొత్తకోటలో డెంగీ జ్వరాలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మండలం కొత్తకోట గ్రామంలో డెంగు జ్వరాలు నమోదయ్యాయి. దీంతోపాటుగా గ్రామంలో పలువురు జ్వరాలతో బాధపడుతున్నారు. వర్షాకాలం కావడంతో ఇక్కడ పారిశుధ్యం లోపించి దోమలు, ఈగలు వద్ధి చెందడంతో పలువురు జ్వరాల బారిన పడ్డారని వైద్యాధికారులు అన్నారు. సీజనల్ వ్యాధులు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామంలో జ్వరాలు విషయం తెలుసుకున్న దంగేరు ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి ఆమని మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, గ్రామానికి నీరు సరఫరా చేసే వాటర్ ట్యాంక్ పరిసర ప్రాంతాలుమురుగునీరు నిల్వతో ఉన్నాయని గ్రామస్తులు తెలిపారు.

కాచి చల్లార్చిన నీటిని తాగాలి

కొత్తకోట గ్రామపంచాయతీలో ఒకరికి డెంగీ బారిన పడ్డారని డాక్టర్ ఆమని తెలిపారు. రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందారని అన్నారు. గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి మరిన్ని జ్వరం కేసులు ఇంటింటా వెళ్లి వైద్య సిబ్బంది నమోదు చేస్తున్నారన్నారు. అన్నిచోట్ల క్లీనింగ్ చేయించి బ్లీచింగ్ చల్లించటం, కాచిన నీటిని తాగాలని సూచించామన్నారు.

జివి.మాల్ ఆధ్వర్యంలో హోమియో వైద్యసేలు

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం జి వి మాల్ ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని ఆదివారం మాల్ ఆవరణలో బిల్డింగ్ అధినేత మండేల బాబి ప్రారంభించారు. డాక్టర్ కేర్ ఆధ్వర్యంలో వైద్యులు ఈ సేవలు నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. హోమియో వల్ల ఉపయోగాలను జివి.మాల్ సిబ్బందికి వివరించారు. హోమియో కేర్ వైద్యులు డాక్టర్ నాగభూషణం (ఎండి), డాక్టర్ కేర్ మేనేజర్ కిషోర్, ఫార్మసిస్ట్ హేమ లకు జివి.మాల్ మేనేజర్ స్వాగతం పలికారు. హోమియో వైద్యవిశిష్ట తను ప్రజల్లోకి మరింత తీసుకువెళ్లాలని ఉద్దేశంతో ఈ ఇటువంటి ఉచిత క్యాంపులు నిర్వహించి అవగాహనా కల్పిస్తున్న ట్లు డాక్టర్ నాగభూషణం తెలిపారు.

కదిరె కృష్ణ పై కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్

ప్రజాశక్తి-ముమ్మిడివరంరూరల్

బహుజన మేధావి డాక్టర్ కదిరే కృష్ణ పై మనువాదులు పెట్టిన కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని స్థానిక బుద్ధపార్కు అవరణలో ప్రజాసంఘాలు, అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో అడ్వకేట్ వడ్డీ నాగేశ్వరరావు మాట్లాడుతూ సంస్కృతంలో ఉన్న వెంకటేశ్వర సుప్రభాతాన్ని తెలుగులో అనువదించి సంస్కృతంలోని విషయాలను తేటతెల్లం చేసిన డాక్టర్ కదిరే కృష్ణ పై మనువాద చికోటి ప్రవీణ్ ఫిర్యాదు చేస్తే, అవగాహన లేని సమాచారంతో పోలీసులు కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేయడమేన్నారు. దొనిపాటి ఆంజనేయులు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో భావవ్యక్తి కరణ స్వేచ్ఛను హరించే రాజ్యాంగ వ్యతిరేక చర్యలను తెలంగాణ పోలీసులుఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.. కదిరే కృష్ణకు ప్రభుత్వమే భద్రత కల్పించాలని జనిపల్లి సత్యనారాయణ డిమాండ్ చేశారు. రౌండ్ టేబుల్ సమావేశంలో కాశి సింహాద్రి వర్మ, సబ్బతి సత్యనారాయణ, కాశి అప్పారావు పులుగు రవి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలను సందర్శించిన ఎపి హైకోర్టు న్యాయమూర్తి

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలోని ప్రముఖ ఆలయాలు అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి, వాడపలి వెంకన్న ఆలయాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిహారీ ఆదివారం దర్శించుకున్నారు.

అయినవిల్లి : విఘ్నేశ్వర స్వామిని ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిహారీ దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు వీరికి దేవదాయ శాఖ అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలకగా, అర్చకులు వేద ఆశీర్వచనం అందజేసి శేష వస్త్రంతో సత్కరించి స్వామి వారి చిత్రపటం అందజేశారు. ఆయన వెంట సి ఐ ప్రశాంత్ కుమార్ ఆలయ సిబ్బంది అర్చకులు ఉన్నారు. **ఆత్రేయపురం:** కోనసీమ తిరుమల గ పేరుగాంచిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి శ్రీతీ ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిహారి స్వామి వారిని ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వీరికి తొలుతగా ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు . స్వామివారి దర్శన అనంతరం తీర్థ ప్రసాదాలతో పాటు స్వామివారి చిత్రపటాన్ని అందజేసి ఆలయ విశిష్టత గురించి తెలియజేశారు.

చిన్నారి వైద్యానికి మంత్రి రూ.20 వేల సాయం

ప్రజాశక్తి-రామచంద్రపురం

సహాయం అందజేస్తున్న మంత్రి సుభాష్

కేన్సర్‌తో బాధ పడుతున్న చిన్నారికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రూ.20వేల ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందజేశారు. మండపేటకు చెందిన నీలపు అనురాధ కుమార్తె అమత వర్షిని చిన్నతనం నుంచి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోంది. చిన్నారి తల్లి రాష్ట్ర మంత్రి సుభాష్ ని కలిసి పరిస్థితి వివరించారు. దీని కి స్పందించిన మంత్రి వెంటనే తక్షణ సహాయంగా రూ.20 వేలు అందజేశారు. ప్రభుత్వ అధికారులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించేందుకు కషి చేస్తానని హామీ ఇచ్చారు.

బాలునికి పలువురు సర్పంచుల సాయం

ప్రజాశక్త -అమలాపురం రూరల్

అమలాపురం మండలంలోని పలువురు గ్రామ సర్పంచ్‌లు. ఆదివారం అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడికి రూ.8 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. పొన్నమండ గ్రామానికి చెందిన బత్తుల లాస్విక్ గత ఆదివారం ఆడుకుంటూ డాబా పైనుంచి కిందకు జారి పడ్డాడు. ప్రస్తుతం కిమ్స్ ఎమర్జెన్సీ ఆసుపత్రిలో వైద్యం అందిస్తున్నారు. బ్రెయిన్ లో నరాలు చిట్లి రక్తం గడ్డ కట్టిందని, ఆరు వారాల పాటు చికిత్స అవసరమని వైద్యులు సూచించారు. ఈ మేరకు సర్పంచులు చేసిన ఈ ఆర్థిక సహాయం బాలుడి వైద్యం కోసం ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను వారు కోరారు. సహాయం చేసిన వారిలో పెనుమాల సునీత ఏడుకొండలు, కరాటం ప్రసన్న ప్రవీణ్, గంగుమళ్ళ ఏసుబాబు, చెల్లుబోయిన నానీ, గోకరకొండ వాసు ఉన్నారు.

బాలుడికి ఆర్థిక సహాయం అందజేస్తున్న సర్పంచ్ లు

ఎస్ఎఫ్ఐ రూరల్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

కాకినాడ రూరల్ ఎస్ఎఫ్ఐ నూతన కార్యవర్గం

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) కాకినాడ రూరల్ మండల కమిటీని నూతనంగా ఎన్నుకోవడం జరిగింది. కమిటీ అధ్యక్షుడిగా రాజేష్, కమిటీ కార్యదర్శిగా సాహిత్ కమిటీ సభ్యులు ఎన్నుకున్నారు. మండల ఉపాధ్యక్షులుగా సాయి నిఖిల్, సత్యసాయి సహాయ కార్యదర్శులుగా వెంకట మణికంఠ, అమృత కమిటీ సభ్యులుగా శ్రావణి, కవిత, విద్యా, సిద్ధి రామ కైలాష్, గమనివేలు, వాసు, రోహిత్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగా సూరిబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు సాహిత్ మాట్లాడుతూ కాకినాడ రూరల్ మండలంలో విద్యారంగ అభివృద్ధికి, విద్యారంగంలో వచ్చిన సమస్యల పరిష్కారానికైకమిటీ కృషి చేయాలన్నారు. ఎస్ఎఫ్ఐని బలోపేతం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు వాసుదేవ్, రూరల్ మండల నూతన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'మధ్యాహ్న భోజనం పథకం' పేరు మార్పు అభినందనీయం

ప్రజాశక్తి-కొత్తపేట

విద్యార్థులకు స్కూళ్లల్లో పెట్టే మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనంగా ఎపి కూటమి రాష్ట్ర ప్రభుత్వం మార్పుచేయడం అభినందనీయమని సీనియర్ నాయకులు పాలూరి సత్యానందం పేర్కొన్నారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ వైసిప ప్రభుత్వం అమలు చేసిన విద్యా సంక్షేమ పథకాలకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం పేర్లు మార్పు చేస్తూ నిన్న విద్యాశాఖ మంత్రి లోకేష్ ఎక్స్ లో పోస్ట్ చేశారన్నారు. జగనన్న అమ్మఒడిని- తల్లికి వందనంగా, జగనన్న విద్యా కానుకకి- సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్రగా, జగనన్న గోరుముద్ద కి -డొక్కా సీతమ్మ మధ్యాహ్నం బడి భోజనం గా, మనబడి నాడు నేడికి- మనబడి మన భవిష్యత్తుగా, స్వేచ్ఛకి బాలికారక్షగా, జగనన్న ఆణిముత్యాలకి- అబ్దుల్ కలాం ప్రతిభా పురస్కారాలుగా పేర్లు మార్పు చేయడం దేశసేవ చేసేవార్ని గౌరవించబడ్డారని కొనియాడారు.

ఘనంగా అసిరాంబ జాతర

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

మండలం లోని అంగర చెరువు వద్ద కొలువై ఉన్న శ్రీ అసిరాంబ అమ్మవారి జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు .ఈ సందర్భంగా అంగర, పడమర కండ్రిక గ్రామాల్లో అమ్మవారి జాతరను గ్రామ వీధుల గుండా డప్పు వాయిద్యాలు, బ్యాండు మేళాలు, గరగ నత్యాలు, విచిత్ర వేషాలతో, బాణాసంచ నడుమ ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు . నిబంధనలు పాటిస్తూ అమ్మవారి జాతర మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

యువ కాపునాడు నూతన కమిటీ నియామకం

ప్రజాశక్తి-అమలాపురం

యువ కాపునాడు జాతీయ అధ్యక్షులు తాడివాక రమేష్ నాయుడు ఆదేశాలు మేరకు యువ కాపునాడు ఎపి అధ్యక్షులు మద్దాల తిరుపతిరావు సూచనలతో నూతన కమిటీని నియమించారని యువకాపునాడు ఎపి ఇంచార్జి నిమ్మకాయల సురేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.యువ కాపునాడు జాతీయ ప్రచార కార్యదర్శిగా గారపాటి నాగేశ్వరరావు(ఎపి), యువ కాపునాడు ఆంధ్ర ప్రదేశ్ సంయుక్త కార్యదర్శిగా పి.మల్లికార్జున (చిత్తూరు జిల్లా), యువ కాపునాడు -డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులుగా అరిగెల తేజ వెంకటేష్ లను ప్రకటించారు. వివిధ జిల్లాల కమిటీలు వారం రోజుల్లో నియమించనున్నట్టు సురేష్ తెలిపారు.

'మట్టా'కు ఎస్‌టియు నాయకుల శుభాకాంక్షలు

ప్రజాశక్తి -మామిడికుదురురూరల్

ఎస్‌టియు సీనియర్ నాయకులు మట్టా నాగరాజు రాష్ట్ర ఉద్యమ శిక్షణ తరగతుల కన్వీనర్‌గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌టియు మామిడికుదురు మండల శాఖ నాయకులు ఆయనకు ఆదివారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. నాగరాజు మామిడికుదురు మండలంలో ఉపాధ్యాయులు గా పనిచేస్తూ 23ఏళ్ల నుండి ఎస్‌టియులో కొనసాగుతూ సుమారుగా 13 ఏళ్లగా మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర కౌన్సిలం పనిచేశారన్నారు. ఈసందర్భంగా మట్టా నాగరాజుకు ఎస్‌టియు మండల శాఖ అధ్యక్షులు కారుపల్లి కళ్యాణ్ బాబు, ప్రధాన కార్యదర్శి కొమ్ములవీర రాఘవ రావు అభినందనలు తెలిపారు.